క్రిమినల్ మేజర్ యాక్ట్ బుక్స్ అందజేత

క్రిమినల్ మేజర్ యాక్ట్ బుక్స్ అందజేస్తున్న హైకోర్టు న్యాయవాది భాస్కర్

పరిగి, జూలై 22: కొత్త చట్టాల సవరణకు సంబంధించిన క్రిమినల్ మేజర్ యాక్ట్ బుక్స్‌ను హైకోర్టు న్యాయవాది రాపోల్ భాస్కర్ తన తల్లి రాములమ్మ జ్ఞాపకార్థం పరిగిలోని బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులకు అందజేశారు. ఈ మేరకు సీనియర్ న్యాయవాదుల చేతుల మీదుగా బుక్స్ పంపిణీ చేపట్టారు. అనంతరం నూతనంగా నియమితులైన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గోపాల్, ఏజీపీ బాలముకుందంలను పరిగి అడ్వకేట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి భక్తకుమార్‌లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కోశాధికారి అలీమోద్దీన్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీ రాజేందర్‌గౌడ్, న్యాయవాదులు లింగం, దామోదర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, వెంకట్రాములు, ఇబ్రహీంఖాన్, ఆనంద్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, నరేందర్‌యాదవ్, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

భిచ్చయ్య భౌతిక కాయానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

మర్పల్లి, జూలై 22 :మండలంలోని బూచన్‌పల్లి గ్రామంలో బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు మధుకర్ తండ్రి భిచ్చయ్య సోమవారం ఉదయం మృతి చెందాడు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ బూచన్‌పల్లి గ్రామంలోని మృతుడి ఇంటికి వెళ్లి బిచ్చయ్య భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు.కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.. అదే విధంగా ఇటీవల పెద్దాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు అలీం తల్లి అఫీసబీ మృతి చెందింది.. అక్కడకి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలయజేశారు. ఆయన వెంట మండల నాయకులు ఉన్నారు..

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

మొక్కలను నాటుతున్న పంచాయతీ కార్యదర్శి మొగులేష్

పెద్దేముల్, జూలై 22 : సామాజిక బాధ్యతలో భాగంగా ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని బండమీదిపల్లి పంచాయతీ కార్యదర్శి మొగులేష్ అన్నారు.సోమవారం వన మహోత్సవంలో భాగంగా స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో పాఠశాల సిబ్బంది, స్థానిక నాయకులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు..కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వర్త్యా శంకర్, ఉపాధ్యాయుడు అక్బర్, నాయకులు రమేశ్, శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్, ఆయా తదితరులు పాల్గొన్నారు.

పరిగి, జూలై 22 ః పరిగి పట్టణంలో సోమవారం పోచమ్మ బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని పలు కాలనీల నుంచి మహిళలు ఊరేగింపు నిర్వహించారు. బోనాల ప్రధాన ఊరేగింపు ముందు భాగంగా మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన తొట్టెల ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా తొట్టెలకు పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాల ఊరేగింపు ప్రారంభించారు. అనంతరం ఆలయంలోను పోచమ్మకు ఆయన ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు బోనాలతో పోచమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి అనంతరం తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎ.సురేందర్, మాజీ సర్పంచ్ సిద్దాంతి పార్థసారథి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు వెంకటేశ్, వారాల రవీంద్ర, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

పాత ఇరిగేషన్ కార్యాలయంలో సామగ్రి తొలగింపు

పాత ఇరిగేషన్ కార్యాలయంలో ఉన్న ఓ పాత షెడ్డును తొలగిస్తున్న వెల్డింగ్ నిపుణులు

పెద్దేముల్, జూలై 22 : ఈ నెల 19న నమస్తే తెలంగాణలో ప్రచురించిన ''పాత ఇరిగేషన్ కార్యాలయ స్థలాన్ని జూనియర్ కళాశాలకు అప్పగించండి'' అనే వార్తకు అధికారులు స్పం దించారు. పాత ఇరిగేషన్ కార్యాలయంలో కొన్ని ఎండ్ల నుంచి వృథాగా పడి ఉన్న సామగ్రిని తొలగించి ఆ స్థలాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అప్పగించాలని కళాశాల పూర్వ విద్యా ర్థులు బాల్‌రాజ్ తదితరులు ప్రిన్సిపాల్ నర్సింహులుకు వినతి పత్రాన్ని అందించారు. అదే విధంగా పెద్దేముల్ మండల నమస్తే తెలంగాణ విలేకరిని ఆశ్రయించగా 19న కథనాన్ని ప్రచు రించారు. అందులో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఆనుకొని ఉన్న పాత ఇరిగేషన్ కార్యాలయంలో ఉన్న సామగ్రిని ఇరిగేషన్ అధికారులు మొత్తం ఖాళీ చేయించారు. జిల్లా ఇరిగేషన్ ఈఈ సుందర్,తాండూరు డీఈ శిరీష, పెద్దేముల్ ఏఈ నవీన్‌ల ఆదేశాలమేరకు ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ సామగ్రిని ఖాళీ చేయించారు. సామగ్రిని తాండూరులోని ఇరిగేషన్ కార్యాలయంలో భద్రపరుస్తున్నారు. ఈ విషయంపై కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు, కళాశాల పూర్వవిద్యార్థులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అర్ధాంతరంగా ఆగిపోయిన పనులు

ఎస్డీఎఫ్ కింద రూ.18 లక్షలతో ఎర్రగడ్డ తండాలో ఎనిమిది నెలల ముందు పాఠశాల అదనపు గదుల నిర్మాణం

పెద్దేముల్, జూలై 22 : మండల పరిధిలోని ఎర్రగడ్డ తండా గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు భవనం లేకపోవడంతో కొన్ని సంవత్సరాలుగా అప్పట్లో గ్రామంలో నిర్మించిన పాత ఎస్టీ కమ్యూనిటీ హాల్ భవనంతోపాటు 2004లో నూతనంగా నిర్మించిన ఎస్టీ కమ్యూనిటీ హాల్ భవనాల్లో పాఠశాలను ఇన్ని ఎండ్లు కొనసాగించారు. ఆ భవనాలు కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరగా అందులో ఒక భవనం కూలడానికి సిద్ధంగా ఉండగా దానిని పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా గ్రామస్థాయి అధికారులు కూల్చివేశారు. తదుపరి పాఠశాల భవనం లేక విద్యార్థులు ,ఉపాధ్యాయులు నానా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామానికి చెందిన కొంతమంది యువ నాయకులు సురేశ్ తదితరులు పాఠశాల సమస్యను అప్పటి తాండూరు ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎస్డీఎఫ్) ఫండ్ కింద రూ.18 లక్షలు మంజూరు చేయగా వెంటనే పనులను ప్రారంభించారు. పనులు పిల్లర్ల వరకు కొనసాగే సమయంలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పాఠశాల భవన నిర్మాణ పనులను కాంట్రాక్టర్ నిలిపివేశారు.అప్పటి నుంచి ఇప్పటి వరకు పనులు ముందుకు సాగలేదు. అప్పటికే పూర్తి చేసిన పనులను కోసం కాంట్రాక్టర్ బిల్లులను సమర్పించగా మంజూరు కాలేదు. దీంతో సదరు కాంట్రాక్టర్ పూర్తిస్థాయిలో పాఠశాల నిర్మాణ పనులు నిలిపివేశారు.తదుపరి 2024-25 విద్యాసంవత్సరం పునఃప్రారంభం సందర్భంగా పాత కమ్యూ నిటీ హాల్‌లోనే పాఠశాలను కొనసాగిస్తూ ఉపాధ్యాయులు నూతన విద్యా సంవత్సరాన్ని ప్రారంభించారు.ప్రస్తుతం ఆ భవనం కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరి పూర్తిగా కురుస్తున్నది. దీంతో క్షణం క్షణం భయం భయంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు అందులో పూట గడుపుతున్నారు. ఎర్రగడ్డ తండా గ్రామంలో ప్రభుత్వ పాఠశాల భవనం లేకపోవడంతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ నిధులు కూడా అర్ధాంతరంగా ఆగిపోయాయి.ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకొని ఎర్రగడ్డ తండాలో పాఠశాల నూతన భవన నిర్మాణ పనులను ప్రారంభించి త్వరగా పూర్తి చేసేలా చూడాలని గ్రామస్తులు,విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు,యువకులు వేడుకుంటున్నారు.

నిలిచి పోయిన పాఠశాల అదనపు గదుల నిర్మాణ పనులు

త్వరగా పూర్తి చేయించండి

మా పిల్లలు అదే పాఠశాలలో చదువుతున్నారు. మా పిల్లలకు ఏదైనా అయితే ఎవరు బాధ్యులు, వీలైనంత త్వరగా భవన నిర్మాణ పనులను ప్రారంభించి పూర్తి చేయాలి.

- చౌహాన్ వసంత్, ఓ విద్యార్థి తండ్రి

చిన్న చూపు వద్దు..

మా పిల్లలు బిక్కు బిక్కు మంటూ చదువుకుంటున్నారు. ఉన్నతాధికారులు గిరిజన విద్యార్థుల చదువులపై చిన్న చూపు చూపరాదు. త్వరగా పనులు ప్రారంభించాలి..

రాథోడ్ శ్రీనివాస్, ఓ విద్యార్థి తండ్రి

నానా ఇబ్బందులు పడుతున్నాం

మా గ్రామంలో ఉన్న కమ్యూనిటీ హాల్ భవనంలో నేను చదువుకొంటున్నాను.ఆ భవనం కూడా మొత్తం శిథిలావస్థకు చేరి కురుస్తున్నది. వర్షం పడితే తరగతి గదిలోకి నీరు వచ్చి ఇబ్బందులు పడుతున్నాం .

– వేదిత్, ఐదోతరగతి

28న ఉచిత కంటి వైద్య శిబిరం

ధారూరు, జూలై 22: శ్రీ సత్యసాయి గ్రామీణ సార్వజనిక కేంద్రం కేరెళ్లి ఆధ్వర్యంలో ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న ఆదివారం ఉదయం 9: 00ల నుంచి మధ్యాహ్నం 1:00 ల వరకు మండల పరిధిలోని కేరెళ్లి గ్రామంలోని సత్యసాయి గ్రామీణ సార్వజనిక కేంద్రం కేరెళ్లిలో సాధూరాం కంటి వైద్యశాల హైదరాబాద్ వారు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పరిగి, జూలై 22: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన పరిగి పట్టణ శివారులో జరిగింది. పరిగి ఎస్ఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం అసోం రాష్ట్రానికి చెందిన పరిమల్‌శీతశర్మ సుగుణ స్టీల్ ఫ్యాక్టరీలో హెల్పర్‌గా పని చేస్తున్నారు. ఈనెల 21వ తేదీ సాయంత్రం పరిగికి వచ్చిన ఆయన సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో తిరిగి కంపెనీకి నడుచుకుంటూ వెళ్తుండగా ఇండియన్ పెట్రోల్ పంపు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం పరిగి ఆసుపత్రికి తరలించగా అప్పటికే పరిమల్‌శీతశర్మ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సుగుణ స్టీల్ ఫ్యాక్టరీ సూపర్‌వైజర్ లగన్‌సాయ్‌పానికా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దరాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్ తెలిపారు.

ప్రజావాణిలో మూడు ఫిర్యాదులు

ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న ఆసరా పింఛనుదారులు

పెద్దేముల్, జూలై 22:మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మూడు ఫిర్యాదులు రాగా అందులో భూ సర్వేకు సంబంధించి ఒకటి కాగా దివ్యాంగుల, వితంతువు పింఛన్లకు సంబంధించి రెండు ఉన్నట్లు ఎంపీడీవో జర్నప్ప తెలిపారు.అదే విధంగా పెద్దేముల్ పోస్ట్‌ఆఫీసులో జూన్ నెలకు సంబంధించిన వివిధ రకాల పింఛన్లను పోస్టాఫీసు అధికారులు ఇవ్వడం లేదని పలువురు ఆసరా పింఛను లబ్ధిదారులు ప్రజావాణిలో ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు.ఎంపీడీవో వెంటనే పోస్ట్‌మాస్టర్‌తో ఫోన్‌లో మాట్లాడగా జూన్ నెలకు సంబంధించిన ఆసరా పింఛన్ల డబ్బులు రీలీజ్ కాలేదని తెలి పారు. అదే విషయాన్ని లబ్ధిదారులకు ఎంపీడీవో నచ్చజెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రమేశ్ కుమార్, ఏవో షేక్ నజీరొద్దీన్, ఏపీఎం బాలయ్య,ఏపీవో నర్సింహులు, ఐసీడీయస్ సూపర్ వైజర్ రాణి, తహసీల్దార్ కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ మహేష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ వేణు, ఫారెస్ట్ ఎఫ్‌బీవో హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

మర్పల్లి, జూలై 22 : చిత్తడిగా మారిన రోడ్డు.. ఇబ్బందులు పడ్డ వాహన దారులు అనే శీర్షికన నమస్తే తెలంగాణ లో సోమవారం ప్రచురితమైన కథనానికి నాయకులు రాములు యాదవ్ స్పందించారు. మర్పల్లి నుంచి పట్లూర్ వెళ్లే రోడ్డులో సాయి బాబా ఆలయం సమీపంలోని కల్వర్టు వద్ద వర్షానికి గుంతలు ఏర్పడి చిత్తడిగా మారి వా హనదారులు రాకపోకలకు ఇబ్బందిగా మారిందని గుర్తించి జేసీబీ సహాయంతో గుంతలను పూడ్చి మొరం వేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు రాచన్న ఉన్నారు.

టీఎల్ ఎం బోధనోపకరణలతో విద్యాబోధన

వివరిస్తున్న హెచ్ఎం వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయుడు బందెప్ప

పెద్దేముల్, జూలై 22 : టీఎల్ఎం బోధనోపకరణలతో విద్యాబోధన చేస్తున్నట్లు నాగులపల్లి ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం బి.వెంకట్‌రెడ్డి తెలిపారు.ఈ మేరకు సోమవారం శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో మొదటి రోజు టీఎల్ఎం- డేలో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల టీఎల్ఎం బోధనోపకరణాలను ప్రదర్శించి వాటి ఆవశ్యకతను వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఉన్న అన్ని తరగతుల విద్యార్థులకు వివిధ సబ్జెక్టుల్లో పాఠ్యాంశాలవారీగా పాఠశాలలో అందుబాటులో ఉన్న లో కాస్ట్-నో కాస్ట్ మెటీ రియల్‌తో టీఎల్ఎం బోధనోపకరణలను తయారు చేసి ప్రదర్శించి విద్యార్థులకు వాటి ఆవశ్య తను వివరించినట్లు తెలిపారు. దీంతో విద్యార్థులు పాఠ్యాంశాలను ఆసక్తితో తిలకించి, అర్థవంతంగా, సులువుగా విషయాలను అంశాలవారీగా అవగతం చేసుకోవడం జరుగుతున్నదన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు బందెప్ప, మెయిజ్, సంగీత, జ్యోతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

మర్పల్లి, జూలై 22 : కొత్తగా పాస్ బుక్కు వచ్చిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకో వాలని ఏఈవో మహేశ్ అన్నారు.. సోమవారం మండలంలోని కొత్లపూర్ క్లస్టర్ రైతు వేదికలో రైతు బీమా దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త పట్టాదారు రైతులకు జూన్ 28 వరకు వచ్చిన పట్టా పాస్‌బుక్ (లేదా) తహసీల్దార్ డిజిటల్ సంతకం అయిన పేపర్, రైతు ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్సులు రైతు బీమా ఫారానికి జత చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు.. 18-59 ఏండ్లలోపు రైతులు మాత్రమే బీమా చేసుకో వాలని, గతంలో బీమా చేసుకున్న రైతులు బీమాలో మార్పులు చేర్పులు, ఆధార్‌లో లేదా నామినీ చనిపోతే మార్పుల కోసం జూలై 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు

విద్యుదాఘాతానికి గురై .. చికిత్స పొందుతూ మృతి

దోమ, జూలై 22: ప్రమాదవశాత్తూ విద్యుదా ఘాతానికి గురైన ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన దోమ మండల పరిధిలోని పోతి రెడ్డి పల్లి గ్రామంలో చోటుచేసుకున్నది.ఎస్సై ఆనంద్‌కుమార్, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సున్నాల అనంతయ్య(62) అనే కౌలు రైతు ఈ నెల 13న పొలంలో బోరు మోటారు నడవడం లేదని అక్కడ ఉన్న ట్రాన్స్ ఫార్మర్ దగ్గరకు వెళ్లి జంపర్ వైర్‌ను కర్రతో సరిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు షాక్‌కు గురై పడిపోయాడు. గమనించిన తోటి రైతు గొట్టం సత్యయ్య కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు.వెంటనే అప్రమత్తమైన కుటుంబ సభ్యులు పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి వికారాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు రెఫర్ చేయగా నిమ్స్ ఆసుపత్రికి తరలించారు.అక్కడ వైద్యం పొందుతూ అనంతయ్య సోమవారం ఉదయం మృతి చెం దాడు. ఈ మేరకు మృతుడి కుమారుడు హన్మంతు తన తండ్రి కరెంట్ షాక్ మృతి చెందాడని దోమ పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆనంద్‌కుమార్ తెలిపారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పరిగి, జూలై 22 : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఆనంద్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నర్సింహ మాట్లాడుతూ ప్రభుత్వంలోకి వచ్చిన ఆరు నెలల్లో కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్‌లు పెంచుతామని చెప్పారని, హామీ మేరకు స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచాలన్నారు. గొల్ల కురుమలకు రెండోదశ గొర్రెల పంపిణీకి సంబంధించి రెండు లక్షల రూపాయలు లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో వేస్తామన్న హామీని మరిచి కాంగ్రెస్ పార్టీ గొల్ల కురుమలను మోసం చేసిందన్నారు. బీసీ సబ్‌ప్లాన్‌కు తగిన నిధులు మంజూరు చేసేందుకు మొదటి అసెంబ్లీ సెషన్‌లోనే చట్టబద్ధమైన హోదాతో జ్యోతిరావు పూలే బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి ఏడాదికి రూ.20వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్లు కేటాయిస్తామన్న హామీ ఏమైందని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాము యాదవ్, బాలకృష్ణారెడ్డి, కేశవులు, నర్సింహ, కాస శ్రీనివాస్, శ్రీశైలం, మహిపాల్, రాంరెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు చర్యలు

చేవెళ్ల రూరల్, జూలై 22 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, వన మహోత్సవాన్ని పకడ్బందీగా చేపట్టాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్య సూచించారు. సోమవారం మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సలహాలు, సూచనలు చేశారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మొక్కలు నాటే కార్యక్రమాన్ని సక్రమంగా చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఎంపీవో, సూపరింటెండెంట్, సిబ్బంది పాల్గొన్నారు

విజేతగా అంకిత్ రావు

దోమ, జూలై 22 : టీ 20 క్రికెట్ ప్రపంచ కప్ టోర్నమెంట్ సందర్భంగా స్టార్ స్పోర్ట్స్ చానల్ వారు విద్యార్థులకు ఆన్‌లైన్ కాంటెస్టు నిర్వహించగా ఆ పోటీలో దోమ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలు ర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదు వుతున్న గౌరారం అంకిత్ రావు పాల్గొని విజేతగా నిలిచారు.అంకిత్ రావుకు సుమారు ముప్పై వేల రూపాయల విలువగల కెంట్ ఏఎల్‌పీఎస్ యూవీ ఎయిర్ ప్యూరి ఫైర్‌ను కొరియర్ ద్వారా అందజేసినట్లు విజేత తండ్రి రాఘవేందర్ రావు తెలిపారు.



చేవెళ్ల గ్రామానికి చెందిన అత్తెల్లి భాగ్యమ్మ తనయుడు అత్తెల్లి జగన్నాథ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా తంగడిపల్లి గ్రామంలోని వేంకటేశ్వర ఆలయ అభివృద్ధికి సోమవారం రూ.50 వేలు విరాళంగా ఆలయ అర్చకులకు అందజేశారు. – చేవెళ్ల రూరల్, జూలై 22

చేవెళ్ల మండల పరిధిలోని తంగడిపల్లి నుంచి శంకర్‌పల్లి వయా మణిడిట్టు, సంకెపల్లి, అంతప్పగూడెం, పర్వేద గ్రామాల్లో మూడు సంవత్సరాల క్రితం ఆగిపోయిన ఆర్టీసీ బస్ సర్వీసును పునరుద్ధరించగా.. సోమవారం తంగడిపల్లి గ్రామంలో ఆర్టీసీ బస్సును రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ ప్రారంభించారు. – చేవెళ్ల రూరల్, జూలై 22

శంకర్‌పల్లి మండల పరిధి కొండకల్ జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులుగా పని చేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు రామకృష్ణారావు, రాములు, వెంకటేశం, సుజాత, అరుంధతి, గత నెల 30న పదవీ విరమణ పొందిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు యాదమ్మలకు సోమవారం ప్రధానోపాధ్యాయురాలు జీవనజ్యోతి ఆధ్వర్యంలో సన్మానం. – చేవెళ్ల రూరల్, జూలై 22

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

మర్పల్లి, జూలై 22 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి మల్లేశ్ యాదవ్, మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మండల నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో విఫలమైందన్నారు. మ్యానిఫెస్టోలో రూ. రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెయ్యలేదన్నారు. రైతు భరోసా, ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు.. ఈ కార్యక్రమంలో నాయకలు శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ రవీందర్ రెడ్డి, మధు కర్,



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

శ్రీశైలం, యాదవ్ రెడ్డి, శాంతి కుమార్ యాదవ్, మహిళ నాయకురాలు అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు..